పాలిసెట్ పరీక్షకు ఉచిత బస్సు సౌకర్యం

ప్రజాశక్తి - కాట్రేనికోన

ఈ నెల 30న శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే పాలిసెట్ ప్రవేశపరీక్షకు హజరయ్యే అభ్యర్థులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం ఆర్‌టిసి బస్సు స్టాండ్ నుంచి ఉదయం 9 గంటలకు, అలాగే తొమ్మిదిన్నర గంటలకు కాలేజీ బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందు చేరుకునేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కావున విద్యార్థులు ఉచిత బస్సు సౌకర్యం ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

మెగా దగా

- డిఎస్‌సి పరీక్ష అర్హతలకు కొర్రీలు
- ఇంటర్, డిగ్రీలో 50 శాతం పీజీలో 55 శాతం మార్కుల నిబంధన
- ఎపిపిఎస్‌సి పరీక్షల సమయంలోనే డిఎస్‌సి పరీక్షల నిర్వహణ
- డిఎస్‌సికి దూరమయ్యే ప్రమాదం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో అర్హతలకు కొర్రీలు పెట్టడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నాళ్లుగానో డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్ల కుమ్మరించింది. డిఎస్‌సి పరీక్షలకు పోటీపడే అభ్యర్థుల సంఖ్యను తగ్గించాలనే కుతంత్రంతో కొత్త కొత్త నిబంధనలతోపాటు ఎపిపిఎస్‌సి పరీక్షలు జరిగే సమయంలోనే షెడ్యూల్ ప్రకటించిందనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. డిఎస్‌సి నోటిఫికేషన్ రెండుసార్లు వాయిదా వేసిన టిడిపి ప్రభుత్వం ఎట్టకేలకు షెడ్యూల్‌ను ఇటీవల ప్రకటించింది. జిల్లాలో 1,241 పోస్టులు ఉండగా, సుమారు 50 వేల మందికి పైగా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మరోవైపు ఒకే సమయంలో డిఎస్‌సి, ఎపిపిఎస్‌సి పరీక్షలు జరుగనున్నాయి. ఎపిపిఎస్‌సి పరీక్షలు జూన్ 16 నుంచి 28వరకూ జరుగుతాయని షెడ్యూల్ ప్రకటించారు. ఎపిపిఎస్‌సి పరీక్షల ద్వారా పాలిటెక్నిక్, జూనియర్ అధ్యాపకులు, డిగ్రీ కళాశాలల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయనున్నారు. తాజాగా డిఎస్‌సి పరీక్షలు జూన్ 6వ తేదీ నుంచి జులై 6వ తేదీ వరకు నిర్వ హించనున్నట్లు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది.

ఎపిపిఎస్‌సి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులే డిఎస్‌సి పరీక్షకు కూడా ఎక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు. రెండు పరీక్షలను ఏక కాలంలో నిర్వహించడం వెనుక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్యను తగ్గించే కుట్ర దాగి ఉందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క డిఎస్‌సి పరీక్షల్లో నిబంధనలపై పలువురు అభ్యర్థులు ఆగ్రహంతో ఉన్నారు. ఎస్‌జిడి పోస్టులకు ఇంటర్‌లో 50 శాతం మార్కులు, స్కూల్ అసిస్టెంట్లు పోస్టులకు డిగ్రీలో 50 శాతం, పిజిటి పోస్టులకు పీజీలో 55 శాతం మార్కులు ఉండాలనే నిబంధన పెట్టారు. ఈ నిబంధనలతో సగమంది అభ్యర్థులు డిఎస్‌సి పరీక్ష రాసే అర్హత కోల్పోతారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిఇడిలో చేరే సమయంలో డిగ్రీలో 40 శాతం మార్కులు అర్హతగా ఉంటే డిఎస్‌సి పరీక్షకు 50 శాతం అర్హత మార్కులు పెట్టడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు ఇంటర్ సిలబస్ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులకు ప్రస్తుత ఇంటర్ సిలబస్‌పై అవగాహన లేదు. గతంలో పదో తరగతి వరకు ఉన్న సిలబస్‌లోనే పరీక్ష నిర్వహించే వారు. డిఎస్‌సి పరీక్షలను నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. భారీ సంఖ్యలో హాజరుకానున్న డిఎస్‌సి పరీక్షకు అన్ని కంప్యూటర్లను ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నిస్తున్నారు. 2018లో టిడిపి హయాంలో నిర్వహించిన డిఎస్‌పి పరీక్షకు తగిన కంప్యూటర్లు లేకపోవడంతో ఎక్కువ మంది అభ్యర్థులకు పొరుగు రాష్ట్రాలైన చెన్నయ్, ఒడిశా, తెలంగాణ, కర్ణాటకలో సెంటర్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో అప్పడికి వెళ్లలేక కొందరు అభ్యర్థులు పరీక్ష రాయకుండా ఆగిపోయారు. గత అనుభవాల నుంచి పాఠాలు తీసుకుని ప్రభుత్వం ఉద్యోగార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో ఖాళీల వివరాలు

ఎస్‌జిటి	423
ఎస్ఎ తెలుగు	65
ఎస్ఎ హిందీ	78
ఎస్ఎ ఇంగ్లీష్	95
ఎస్ఎ గణితం	64
ఎస్ఎ పిఎస్	71
ఎస్ఎ బయాలజీ	108
ఎస్ఎ సోషల్	132
ఎస్ఎ పిఇడి	210
మొత్తం	1241

నిబంధనలు సడలించాలి

డిఎస్‌సి పరీక్షల్లో అర్హతలకు సంబంధించిన నిబంధనలను సడలించాలి. ఎన్నో ఏళ్లుగా డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్న నాలాంటి వారికి ఈ నిబంధనలు అడ్డంకిగా మారాయి. దీని వల్ల చాలా మంది అర్హతను కోల్పోతారు. బిఇడి ఉన్న అర్హతను కాదని డిఎస్‌సికి మరో అర్హతలను నిర్ణయించడం సరికాదు. మార్కుల నిబంధనను సడలించాలి.

- యు.శాంతి సరస్వతి, రాజమహేంద్రవరం

పరీక్షల తేదీలను మార్చాలి

డిఎస్‌సి పరీక్షల సమయంలోనే ఎపిపిఎస్‌సి పరీక్షలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఎపిపిఎస్‌సి షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆ సమయంలోనే డిఎస్‌సి పరీక్షను నిర్వహించడం తగదు. విద్యార్థులు రెండింటిలో ఒక పరీక్షను వదులుకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం పునః పరిశీలన చేయాలి. అభ్యర్థులందరికీ న్యాయం చేయాలి.

- జి.సంధ్య, జేగురుపాడు, కడియం మండలం

కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలుచుని నిరసిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సిబ్బంది

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని ఎపిఎంసిఎ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఎపి ఎంసిఎ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.మమతజ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.సాయిశంకర్, జిల్లా కార్యదర్శి కె.సాయితేజ మాట్లాడారు. గత ఆరేళ్లుగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పని చేస్తున్నామని, ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ బకాయిలు వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని, నిర్దిష్టమైన జాబ్ చాట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సిహెచ్ఒలను మినహాయింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ ఇంక్రిమెంట్ ట్రాన్స్‌ఫర్ పితృత్వ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ ఆఫీసర్లుగా ఆరేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. గత రెండేళ్లుగా జీతాల విషయంలో తీవ్ర నిరాశను ఎదుర్కొంటున్నామని, 2023లో ఎన్‌హెచ్ ఉద్యోగులందరికీ 23 శాతం వేతన సవరణ ఇచ్చినప్పటికీ, తమకు అది వర్తింప చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 జూలై నుంచి ఆన్‌లైన్ విధానంలో చెల్లింపులు జరిపిన పిబిఐలో జరిగిన అవకతవకలతో తాము తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. తక్షణమే తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.రంగారావు, సాయితేజ, శ్రీరామ్, హిమజ, బి.శివ, టి.మనోహర్, వెంకటేష్ జల్లి, సుమంత్, రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా కృషి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఎంపిపి కుండా అన్నపూర్ణ సూచించారు. సోమవారం ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మండలంలో సమస్యలను ఏకరూపెట్టారు. రబి సీజన్లో రైతుల వద్ద నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని కోరారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి వస్తున్న భక్తులు ఇరిగేషన్ స్థలాల ఆక్రమణకు గురి కావడంతో ట్రాఫిక్ రద్దీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆక్రమణలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వాడపల్లికి వచ్చే భక్తుల ఇబ్బందులు లేకుండా ఇరిగేషన్ స్థలాలు కాలువగొట్లు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్‌పిటిసి బోణం సాయిబాబా మాట్లాడుతూ లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం గ్రామాలకు చెందిన పంట పొలాల ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మెర్లపాలెంలో లో-వోల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మెర్ల రాము, ఎంపిటిసి సభ్యులు మెర్ల వీరబాబు కోరారు. ఈ సమావేశంలో తహశీల్దార్ టి.రాజేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అన్నపూర్ణ

విద్యార్థులను అభినందించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - మండపేట

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎస్ఎస్‌వివి మున్సిపల్ హైస్కూల్, జవహర్ లాల్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అభినందించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయా హైస్కూల్స్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వై.మోహన వెంకటదుర్గ, పి.బిందుసాయిశ్రీ, షేక్ సబీన, బల్లా పల్లవి, యర్రగంటి కిరణ్మయిలను ఆయన శాలువాలతో సత్కరించి మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, హెచ్‌ఎంలు జి.లత, సిహెచ్‌వివిఎస్ఎన్.మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దాట్ల

ఉచిత కుట్టు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

మండలంలోని కేశనకుర్రు పంచాయతీ పరిధిలోని బైర్రాజు ఫౌండేషన్ స్త్రీశక్తి భవనం వద్ద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా శిబిరాన్ని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి, ఇబిసి, కాపు సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. శిక్షణతో పాటు, వారికి కుట్టు మిషన్లను ఆయా సామాజికవర్గాల కార్పొరేషన్‌ల నుంచి అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు గృహిణిగా ఉంటూనే తన కాళ్లపై తాను నిలబడేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆలోచన చేసి ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తుందన్నారు. మహిళలు స్వయం ఉపాధిని పొందడానికి, ఆర్థికంగా సాధికారతను పొంద డానికి ఈ శిక్షణ దోహదం చేస్తుందని అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు. ఈ అవ కాశాన్ని ఆయా సామాజికవర్గాలకు చెందిన మహిళలు సద్వినియోగం చేసుకో వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీర సత్యకుమారి, సాగిరాజు సూరిబాబు రాజు, వనచర్ల వెంకటేశ్వరావు, చిలువూరి సుబ్బ రాజు, విజ్జల్ రాజు, కాకర్లపూడి రాజేష్, పిన్నమరాజు శివ, రాంబాబు పాల్గొన్నారు.

నాచు సాగుతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో సముద్ర తీరం వెంబడి జీవనోపాధికి దోహదపడే చెరువు ఆధారిత సముద్రపు నాచు సాగు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల జిల్లా స్థాయి అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి, డిఆర్‌డిఎ, ఎల్‌డిఎం అధికారులతో కలెక్టర్ సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు ద్వారా వచ్చే సముద్రపు నాచుకు భవిష్యత్తులో మంచి డిమాండ్ రానున్నదని అన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలలో ఈ సాగును చేపట్టి మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని తెలిపారు. ఆ దిశగా జిల్లాలో సాగు విస్తర ణకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ నాచు ఉత్పత్తుల వల్ల వ్యవసాయానికి సేంద్రియ ఎరువులు, పశువులకు పశు గ్రాసం, చేపలు, కోళ్లకు మేత, కాస్మోటిక్స్ తదితర రంగాలలో పర్యావరణ హితమైన ఉత్పత్తులను దోహదకారిగా ఉంటుందన్నారు. నాచు సాగుకు రాజోలు సముద్ర తీర ప్రాంతంలో అనువైన ప్రదేశాలను ఆర్‌డిఒ కె.మాధవి సమన్వయంతో గుర్తించాలని ఆదేశించారు. తొలి దశలో 40 మంది ఔత్సాహిక స్వయం సహాయ సంఘాల మహిళలు, మత్స్యకార సంఘాల ప్రతినిధులను గ్రూపులుగా విభజించి తమిళనాడులోని రామనాథపురం జిల్లా మండపంలో ఉన్న ఈ సాగుపై శిక్షణను ఇప్పించేందుకు విధి విధానాలను, అందుకు అవసరమైన నిధుల లభ్యతపై నివేదికలను మే 2వ తేదీ నాటికి రూపొందించాలని ఆదేశించారు. గ్రీన్ క్లైమేట్ ఫండ్, పిఎం మత్స్యకార యోజన తదితర పథకాల ద్వారా యూనిట్ల నిర్వహణకు కార్యాచరణ రూపకల్పన చేయాలన్నారు. తొలి దశలో శిక్షణ ముగించి రెండో దశగా మండపం నుంచి శాస్త్ర వేత్తలను తీసుకొచ్చి సముద్ర తీరం వెంబడి ఉప్పు శాతం ఆధారంగా ఏయే రకాలైన నాచు ఉత్పత్తులు పెంపకానికి అనువుగా ఉంటాయో నిర్ధారించాలన్నారు. ఒక్కొక్క యూనిట్ నిర్వహణకు అయ్యే ఖర్చు అంచనాలు, ఫండింగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్, నాబార్డ్ జిల్లా మేనేజర్ సహకారంతో రూపొందిం చాలన్నారు. ఆహారం, ఎరువుల కోసం స్థిరమైన ప్రత్యామ్నాయ పరిష్కారాలను రూపొందించడానికి ప్రకృతి అందించే అద్భుత పంట అయిన సముద్రపు నాచు శక్తిని వినియోగించు కోవాలన్నారు. కార్బన్‌ను తగ్గించి సముద్రపు నాచు పొలాలకు ప్రత్యామ్నాయ ఎరువుగా సహాయపడు తుందన్నారు. తీరప్రాంత సమాజాలను శక్తివంతం చేస్తుందన్నారు. సముద్రపు నాచు ఎనర్జీ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన విధానాలను సృష్టించనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.మాధవి, గ్రీన్ క్లైమేట్ ఫండ్ ప్రతినిధి శ్రీహర్ష, జిల్లా మత్స్యశాఖ అధికారి పివి.శ్రీనివాసరావు, జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవి.ప్రసాద్‌రావు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి శంకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ, ఎల్‌డిఎం కేశవవర్మ, డిఆర్‌డిఎ పీడీ జైచంద్రగాంధీ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపుదల

ప్రజాశక్తి - యంత్రాంగం

అమలాపురం స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ హెచ్‌ఎం కామేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జివిఆర్‌ఎకె.వర్మ, సిబ్బంది పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రిటైర్ ఉపాధ్యాయులు చిట్టూరి సత్యనారాయణమూర్తి, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ సూరంపూడి సతీష్ పాల్గొని మాట్లాడారు. పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్‌లకు పరిమితదం కాకుండా గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ డి.హేమచంద్, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభయ్యాయి. తొలుత గ్రంథాలయోద్య మకారుడు అయ్యంకి వెంకటరమణయ్య, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు సర్పంచ్ జి.సుధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. **ముమ్మిడివరం** స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. గ్రంథాలయ నిర్వాహకులు శీలం నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్, కథల పుస్తకాలను పఠించారు. **ఉప్పలగుప్తం** స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సలాది నాగేశ్వరరావు అధ్యక్షతన వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, గ్రామ పెద్దలు చీకట్ల అబ్బాయి, చిక్కం పెద్దబ్బులు, చిక్కం సూర్యనారాయణ, నాగులపల్లి పాపయ్య రాజు, చిక్కం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే భీమనపల్లి శాఖా గ్రంథాలయంలో శాఖా గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషుకుమార్ అధ్యక్షతన వేసవి శిక్షణా తరగతులు ప్రారంభించారు.

వ్యాధుల వ్యాప్తి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

కీటక జనిత వ్యాధుల వ్యాప్తి నివారణపై స్థానిక పిహెచ్‌సిలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పిహెచ్‌సిలో ల్యాబ్ పనితీరు, రోగ నిర్ధారణ పరీక్షలు, రికార్డులు పరిశీలించారు. మలేరియా డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన పెంచడానికి ప్రతి ఒక్క సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. అనంతరం మలేరియా, డెంగీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కెవిఎస్. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

శ్మశాన వాటికకు ఫ్రీజర్ వితరణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ గౌతమి బ్రిడ్జి వద్ద ఉన్న శ్మశాన వాటికకు దాతలు ఫ్రీజర్‌ను సోమవారం వితరణ చేశారు. కీర్తిశేషులు వెత్సా నరసింహమూర్తి, లక్ష్మి సూర్యకాంతం జ్ఞాపకార్థం వారి కుమారుడు వెత్సా సురేష్‌కుమార్, రాధిక దంపతులు రూ.1.05 లక్షల విలువ గల ఫ్రీజర్‌ను అందజేశారు. జన్నాడా పరిధి ప్రాంతంలో మృతి చెందిన వారి బంధువులు వచ్చేంతవరకు ఫ్రీజర్‌లో భద్రపరచడానికి సుదూర ప్రాంతాల నుంచి ఫ్రీజర్‌ని తీసుకురావాల్సి వస్తుందన్నారు. ఈ ఇబ్బందులను తొలగించేందుకు సురేష్‌కుమార్, రాధిక ఫ్రీజర్‌ను జొన్నాడ గ్రామానికి చెందిన నామల వెంకట్రావు చేతుల మీదుగా అందజేశారు. ఫ్రీజర్ ను అందజేసిన దాతలను పలువురు అభినందించారు.

ఫ్రీజర్‌ను అందజేస్తున్న దాతలు

కరాటే పోటీల్లో మండపేటకు పతకాల పంట

ప్రజాశక్తి - మండపేట

న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్ ఫు గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజబాబు వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు కుంగ్ ఫు కరాటే పోటీల్లో పతకాల పంట పండించారు. రాజానగరం మండలం తుంగపాడులోని శిరిడి సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఇంటర్ స్టేట్ కుంగ్ ఫు అండ్ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ 2025 పోటీల్లో మండపేట నుంచి 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 16 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్ నుంచి బ్రౌన్ బెల్ట్ వరకూ కటాస్ విభాగంలో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు. స్పేరింగ్ విభాగంలో డి.రాకేష్ (బ్లూ బెల్ట్) మొదటి స్థానం, పి సాయి, ఎల్.సిద్దు (గ్రీన్ బెల్ట్‌లు) మొదటి స్థానాలను సాధించారు. అలాగే సిహెచ్.తరుణ్ గోవింద్ (ఎల్లో బెల్ట్) మొదటి స్థానం, జి.యజ్ఞేశ్వర రెండవ స్థానం గెలుచుకున్నారని మాస్టర్ రాజబాబు తెలిపారు. రాజానగరం నియోజకవర్గ ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ చేతుల మీదుగా విజేతలు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు.

పతకాలను ప్రదర్శిస్తున్న విజేతలు

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు హామీనిచ్చారు. మండలంలోని ఠానేలంక పంచాయతీ పరిధిలోని బలుసులంక గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చిన్నం ప్రసాదరావు కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించారు. స్థానిక నాయకులు సమాకూర్చిన నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో నాయకులు గుత్తుల సాయి, గుద్దటి జమ్మి, అర్ధాని శ్రీనివాసరావు, కొప్పిశెట్టి శెట్, ఇసుకపట్ల ఈశ్వర్‌కుమార్, కోరుకొండ శివ, బొక్కా సత్తిబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఒ రాజకుమారి, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు ఎస్.మధుసూదన్, జయచంద్రగాంధీ, ఎస్‌డిసి కృష్ణమూర్తిలతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పరిష్కారాలను చూపాలని, ఏ ఒక్క అర్జీని సరైన కారణాలు చూపకుండా పరిష్కరించినట్లు ఎండార్స్‌మెంట్ చేయరాదని అన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో అర్జీదారుల సమక్షంలో విచారించి ఆమోదయోగ్యంగా పరిష్కరించాలన్నారు. ఉన్నతాధికారులు సిఫార్సు చేసిన అర్జీలను నాణ్యతతో పరిష్కరిం చాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహిం చేది లేదని ఆయన స్పష్టం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఒకే అంశంపై అర్జీలు పునరావృతం కాకుండా గడువు దాటిన అర్జీలు లేకుండా అధికారులు జాగ్రత్తలు వహించాలన్నారు. అర్జీలను మొక్కుబడిగా కాకుండా పూర్తి నాణ్యత ప్రమాణాలతో పరిష్కారం చూపాలని ఆదేశిం చారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంలో సుమారు 233 అర్జీలను స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్

మేడేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడేని ఘనంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం మేడే సన్నాహక సమావేశం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొనాలని సూచించారు. పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసేలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రలు సాగిస్తుందని అన్నారు. కార్మిక చట్టాలను హరిస్తూ లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ మేడే స్ఫూర్తితో పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మే ఒకటో తేదీ ఉదయం 9 గంటలలోపు సంఘాల వారీగా ఎర్రజెండాలను ఆవిష్కరించి, ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలో జరిగే మేడే కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ఇళ్ల సూరిబాబు, రత్నం, అనంతలక్ష్మి, లక్ష్మీదేవి, సుభద్ర, గంగాభవాని, సూర్యవతి, కనకదుర్గ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన యువకుని మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుని ఆరోగ్యం విషమించి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు గాయపడగా వారిలో అయినవిల్లి మండలం శంకరాయగూడెంకు చెందిన ఉందుర్తి బాలబాలాజీ(22) కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పోందుతున్నాడు. అతని ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి-కాకినాడ

ఒక హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సోమవారం స్థానిక నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ తీర్పు వెలువరించారు. కాకినాడ టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి. 2022లో మెయిన్ రోడ్డులోని ఎస్ఆర్ గ్రాండ్ హోటల్ రూమ్‌లో కాట్రేనికోన మండలం పల్లాం గ్రామానికి చెందిన పాలేపు కాసుబాబు (23)ను అదే గ్రామానికే చెందిన మల్లాడి రవికాసు మద్యం సీసా పగుల గొట్టి పొడిచి హత్య చేశాడు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై కాకినాడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ ముద్దాయికి యావజ్జీవ జైలు శిక్షతోపాటు, రూ.పది వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

కాకినాడలో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలోని వైఎస్ఆర్ ఫ్లయ్ ఓవర్‌పై సోమవారం ఎలక్ట్రిక్ బైక్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగి దగ్ధమైంది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే స్పందించిన ట్రాఫిక్ సిఐ ఎస్.రమేష్, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈ బైకుకు సంబంధించిన వారెవరకూ అక్కడ లేరని, బైకుకు కనీసం నెంబర్ కూడా లేదని ట్రాఫిక్ సిఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని రెండో పట్టణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. బైకు ఎవరిది? అనే దానిపై ఆరా తీస్తున్నారు. చోరీకి గురైన బైకుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీస్ సిఐ ఎస్.రమేష్, సిబ్బందిని, ఫైర్ సిబ్బందిని ఎస్‌పి జి.బిందు మాధవ్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-తాళ్లరేవు

కోరంగి పంచాయితీ ఓల్డ్ అయ్యప్ప స్వామి గుడి సమీపంలో జాతీయ రహదారి 216పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. నెక్కంటి రొయ్యల కంపెనీ నుంచి మట్లపాలెం వెళుతున్న ఆటో కుక్క అడ్డుగా రావడంతో రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలకు గాయాలు కాగా ఒక మహిళకు తలకు తీవ్ర గాయం అయింది. ఆటో డ్రైవర్‌కు ఎడమ చేయికి తీవ్ర గాయం అయింది. కోరంగి పోలీసులు, స్థానికులు హుటాహుటిన 108లో వారిని తాళ్లరేవు సిహెచ్‌సికి తరలించారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని రూపుమాపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ అన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ సోమవారం రాత్రి యానాం పట్టణంలో ప్రజాసంఘాలు, సిఐటియు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతు రాంబాబు, తాళ్లూరి శ్రీనివాసరావు, దాసరి రాజు, కె.మధుబాబు, సబ్బతి రాంబాబు, నూకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - యానాం

మే 1న సిఐటియు నిర్వహించే మేడే కార్యక్రమాలలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటీయు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ కోరారు. యానాంలోని ఉన్న ప్రజా సంఘాల ముఖ్య నాయకులతో టాక్సి స్టాండ్ వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. మే ఒకటో తేదీన ఉదయం జండా ఆవిష్కరణ అనంతరం యానాం నల్లచెరువు వద్ద నుంచి ప్రదర్శనగా పిల్లారాయ స్ట్రీట్ మీదగా పాత బస్టాండ్ వరకు ప్రదర్శన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాం భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు చంటి, చిన్ని రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సబ్బతి రాంబాబు, తిరుకోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు గిడ్ల యేసు, తాళ్లూరు శ్రీనివాసరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు భైరవమూర్తి, గూడ్స్ ఆటో యూనియన్ నాయకులు యాదల శ్రీనివాసరావు, ఎం.దుర్గాప్రసాద్, టాక్సీ స్టాండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాల ముఖ్య నాయకులు

దసరా బుల్లోడు కోడుపై వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

విలసవిల్లి-గోకనవిల్లి గ్రామాల మధ్య ఉన్న దసరా బుల్లోడు కోడు (డ్రెయిన్)పై వంతెనను నిర్మించాలిన సర్పంచ్ సలాది ఊర్మిళదేవి కోరారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్‌లో గ్రామస్తులతో కలిసి ఆమె ఎఒ ఎంఎల్ఎన్.మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విలసవిల్లి పంచాయితీ పరిధిలో ఉన్న గోకనవిల్లి గ్రామస్తులు పంచాయతీ పనులు నిమిత్తం విలసవిల్లి రావాలంటే ముమ్మిడివరం మండలం అనాతవరం, సింగరాయపాలెం, భీమనపల్లి గ్రామాల మీదుగా సుమారు ఐదు కిలోమీటర్ల మేర ప్రయాణించి రావాల్సి వస్తుందని తెలిపారు. ఈ ఇబ్బందులు సుమారు 70 ఏళ్లుగా గోకనవిల్లి ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విలసవిల్లి గోకనవిల్లి గ్రామాలు పక్క పక్క గ్రామాలైనప్పటికీ దసరా బుల్లోడు కోడుపై వంతెన లేకపోవడంతో ఇన్ని ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. వంతెన నిర్మిస్తే గోకనవిల్లి, విలసవిల్లి గ్రామాల ప్రజలతో పాటు ఎస్.యానం, చల్లపల్లి, సరిపల్లి, గోపవరం, కూనవరం, సీతారామపురం, కిత్తన చెరువు, సవరప్పాలెం, సమనస తదితర గ్రామాల ప్రజలు అమలాపురం మీదుగా వెళ్లకుండా దగ్గర దారిలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, యానం, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వంతెన ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ముషిణి లింగేశ్వరరావు, జంగా నాగమణి, ముషిణి రాంబాబు పాల్గొన్నారు.



ఎఒకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళదేవి

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని పాశర్లపూడిలంకలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చేసిన విశాల దృక్పథం, సమాజంలోని అణగారిన వర్గాలకు ఇచ్చిన శక్తి మరపురానివని అన్నారు. 'అంబేద్కర్ ఆలోచనలు, సంప్రదాయాలను ముందుకు తీసుకోని వెళ్తూ ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది' అని అన్నారు.ఈ కార్యక్రమంలో గన్నవరం వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, తెలరెడ్డి సూర్యప్రకాశరావు, చెరుకూరి సత్తిబాబు, కొనుకు నాగరాజు, కటకం శెట్టి ఆదిత్య, నెల్లి దుర్గాప్రసాద్, జై భీమ్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో నినాదాలు చేస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

డొక్కా సీతమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి - మండపేట, పి.గన్నవరం

ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక బూరుగుంట చెరువుపార్క్‌లో డొక్కా సీతమ్మ విగ్రహం వద్ద విజయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ 116 వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మండపేట పట్టణంలో జన్మించడం మనం చేసుకున్న అదృష్టమని అన్నారు. అన్నదానానికి మించిన దానంలేదని విశ్వసించి ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడమే ధ్యేయంగా జీవితాంతం పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, విజయం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బి.విజయ్ మోహన్, అన్నవరం దేవస్థానం మాజీ మెంబర్ అవసరాల వీర్రాజు, నాయకులు జొన్నపల్లి సూర్యా రావు, యినపకోళ్ళ సత్యనారాయణ, ముత్యాల పద్మ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. డొక్కా సీతమ్మను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం ఆక్విడెక్ట్ వద్ద డొక్కా సీతమ్మ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ చేయాలనే సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో పెరగాలని అన్నారు. కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ ఆదర్శాలను అనుసరిస్తూ పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి, టిడిపి నియోజకవర్గ కో కన్వీనర్ డివివి.సత్యనారాయణ, నాయకులు వాసంశెట్టి కుమార్, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, చిట్టూరి శ్రీనివాస్, ఎస్.పెద్దిరాజు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో పూలమాలలు వేస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

మండపేటలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

2న డిఎస్‌సిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - అమలాపురం

డిఎస్‌సి అభ్యర్థులకు మే 2న అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.కేశవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షల కోచింగ్ నిపుణులు, మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు సారథ్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సు మే 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని ప్రశాతం వీధిలో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో ప్రారంభం అవుతుందన్నారు. ఈ సదస్సుకు హజరైన అభ్యర్థులకు సైకాలజీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు.

సంతాప సభలో మాట్లాడుతున్న ఎంపిడిఒ మహేశ్వరరావు

సాయిరాం మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలోని గోపాలపురం పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల సాయిరాం మృతి తీరనిలోటని ఎంపిడిఒ ఇ.మహేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాయిరాం సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సాయిరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కుడుపూడి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి గంగుల కృష్ణ, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా తాతరాజు

ప్రజాశక్తి - మండపేట

ఎపి ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా పట్టణానికి చెందిన సుమేథ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధినేత గుండు తాతరాజు నియమితుల య్యారు. సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాతరాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేటు స్కూల్స్ సమస్యల పరిష్కారానికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 34/2025

Between:
1. Chitturi Padmavathi
2. Chitturi Shravani Chowdary ...*Plaintiffs*

AND

D-1: M/s. Shell India Markets Private Ltd., rep. by its General Manager, Regd. Office: 2nd Floor, Campus, 4A, RMZ Millenia Business Park, 143, Dr. MGR Road, Perungudi, Chennai - 600096.
D-2: The State, rep. by its District Collector, East Godavari, Rajamahendravaram.
D-3: The Tahasildar, O/o. Mandal Revenue Office, Seethanagaram, Seethanagaram Mandal. ...*1, 2, 3 Defendants*

పై నెంబరు దావాలో 1, 2, 3 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 07-5-2025 సం॥రం తేదీ** ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **కవి హనుమంతరావు**
28-4-2025 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఏ. నెం. 217/2024
మరియు
ఓ.యస్. నెం. 582/2024

పార్టీలు:
రాజా కోటేశ్వరరావు -**పిటీషనరు/వాది**
మరియు
తమనంపూడి గణపతి రెడ్డి -**రెస్పాండెంటు**

తమనంపూడి గణపతిరెడ్డి, (తండ్రి): కనికిరెడ్డి, డోరు నెం. 1-56, అంకాలమ్మ గుడి దగ్గర, రావులపాలెం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నెంబరు దావా గ్రంథంలో మీరు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు అందుకోనందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది. పై నెంబరు దావా మీ హాజరుకు గాను పై కోర్టులో ది. 02-05-2025వ సం॥రం తేదీకు వాయిదా అయి ఉన్నది. కావున మీరు పై కోర్టు ఎదుట **ది. 02-05-2025వ సం॥రం తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలియపర్చుకోగలరు. లేని యెడల పై దావా మీ పరోక్షమున నిర్ధారింపబడును.

జె.బి.యస్.బాపూజీ
వాది తరపున అడ్వకేట్
రాజమహేంద్రవరం
సెల్: 8309867728

అవార్డు గ్రహీత సుభాష్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీత, పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎ.రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జడ్‌పిటిసి తోరాటీ సీతామహాలక్ష్మి, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, వెటర్నరీ ఎడి ఎల్.అనిత పాల్గొని మాట్లాడారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావలసిన పినపళ్లకు ఆ అవకాశం తృటిలో తప్పిపోవడం బాధాకరమన్నారు. సర్పంచ్ సుభాష్ ఏమాత్రం అధైర్యపడకుండా మొక్కవోని దీక్షతో గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో లభించిన గుర్తింపును జాతీయ స్థాయికి తీసుకు వెళ్ళగలిగే సత్తా సర్పంచ్ సుభాష్ నేటి యువతరానికి ఆదర్శమని కొనియాడారు. గ్రామస్తుల సహకారం మరువలేనిదని సర్పంచ్ సుభాష్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి కారణమైన గ్రామస్తుల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. అనంతరం సర్పంచ్‌ను ఘనంగా సత్కరించారు. మెమొంటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం.ఎం.ప్రకాష్, మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీలావణ్య, ఎంఇఒలు బి.అప్పాజీ, ఎస్‌వి.సుబ్బరాజు, ఎపిఎం ఎం.ధనరాజు, ఎపిఒ జి.అరుణకుమారి, ట్రాన్స్ కో జెఇ డి .దుర్గాప్రసాద్, హౌసింగ్ జెఇ డి.శ్రీనివాస్, జెఎ షేక్ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీత సర్పంచ్ సుభాష్‌ను సత్కరిస్తున్న అధికారులు

కానరాని వేసవి చలివేంద్రాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

భానుడి భగభగలతో వేసవి ఉష్ణగ్రతలు పెరిగి ఎండల తీవ్రత పెరగడంతో ఉదయం పది గంటలు దాటితే ప్రజలు బయటకి రావాలంటేనే బేంబేలెత్తుతున్నారు. పాదచారులు రోడ్డు ఎక్కితే ఎక్కడ వడదెబ్బ తగులుతుందోనని భయ పడుతున్నారు. నగరానికి వచ్చే పాదచారులను వడదెబ్బ నుంచి రక్షించెందుకు మజ్జిగ/ చల్లని నీటి చలివేంద్రాలు ఎంతో అవసరం. గతంలో వేసవి కాలం వస్తుందంటే ముందస్తుగానే ముఖ్య కూడలిల్లో చలివేంద్రాల ద్వారా మజ్జిగ/చల్లని నీరు అందుబాటులో ఉంచే పరిస్థితి ఉండేది. ఈ ఏడాది వేసవి ఎండలు మండుతున్నా నగర పంచాయతీ అధికారులు ఎక్కడా చలివేంద్రాలు ఏర్పాటు చేసిన దాఖలాలు కన్పించడం లేదు. చలివేంద్రాల ఏర్పాటుకు సాధారణ నిధుల నుంచి లక్ష రూపాయలు కేటాయించి, కౌన్సిల్ ఆమోదం లభించినా నేటికీ చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామాల నుంచి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా డబ్బులు వెచ్చించి తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు అలసత్వాన్ని వీడి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు పవర్ ట్రిల్లర్లను పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

రైతులకు పవర్ టిల్లర్ల పంపిణీ

ప్రజాశక్తి - ఐ.పోలవరం

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో పలువురు రైతులకు పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. సోమవారం మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల వ్యవసాయ శాఖ అధికారులు ఎం.వాణి, ఎస్.ప్రశాంత్‌కుమార్, కె.ప్రవీణ్‌కుమార్ సమక్షంలో రైతులకు పవర్ ట్రిల్లర్ యంత్రాలు, పచ్చిరొట్ట విత్తనాలను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 50 శాతం రాయితీపై పవర్ ట్రిల్లర్లను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సాగిరాజు సూరిబాబురాజు, పిన్నమరాజు శివ, కాకర్లపూడి రాజేష్, బొంతు శ్రీరాములు, తాడి నరసింహమూర్తి, నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీను, విఎఎవిహెచ్ఎలు సురేష్, మనోజ్, దునీష, బాబాయి పాల్గొన్నారు.

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో

I.A. No. 10/2024
O.S. No. 105/2021

Between:
Nalamati Krishnakanth ...*Petitioner*
AND
Putta Rama Krishnarao ...*Respondent*

Respondent: Putta Rama Krishnarao, S/o. Padda, age 70 years, D.No. 1-77, Vadlamuru, Kapileswarapuram Mandal.

యిందలి నెంబరు గ్రంథమున యిందలి పిటీషనరు మీపై ఫైనల్ డిక్రీ పాస్ చేయించమని పిటీషను దాఖలు చేసియుండి, మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించియున్నప్పటికిన్నీ ఉద్దేశ్య పూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **ది. 08-5-2025 సం॥ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మహారాజశ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

N.S.R.N.CHOWDARY
రామచంద్రపురం Advocate
ది.4-4-25 Kakinada

వర్గీకరణపై ఆర్డినెన్స్‌ను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి - రాజోలు

ఎస్‌సి వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే నిలుపుదల చేయాలని మండల మాలల న్యాయ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సామాజిక భవనంలో మండల జెఎసి అధ్యక్షులు మట్టా సురేష్‌కుమార్ అధ్యక్షతన సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ పార్టీలు మాలలను అణిచివేసేందుకు కుట్రలు సాగిస్తున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం మాలలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలందరూ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పొలుమూరి శ్యాంబాబు, మండల జెఎసి ప్రధాన కార్యదర్శి లిఖితపూడి బుజ్జి, ఉపాధ్యక్షులు మందపాటి మధు, ఇతర నాయకులు విప్పర్తి సాయిబాబు, బత్తుల మురళీకృష్ణ, కొల్లాబత్తుల సతీష్, చిలకపాటి శ్రీధర్, జిల్లెళ్ళ వినోద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పోరాట సమితి నాయకులు

మత్స్యకారుల సంక్షేమమే కూటమి లక్ష్యం

ప్రజాశక్తి - పి.గన్నవరం

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కె.నుగుపల్లిలో మత్స్యకారులు ఆధ్వర్యంలో పిఎం, సిఎం, డిప్యూటీ సిఎం ల చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేట నిషేధం సమయంలో ఆర్థిక సహాయాన్ని రూ.10 వేలు నుంచి రూ.20 వేలుకు పెంచి మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి, నామన రాంబాబు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, బొంతు పెదబాబు, చిట్టూరి శ్రీనివాస్, వి.కుమార్, ఎస్ పెద్దిరాజు, ఆదిమూలం సురయ్య కాపు పాల్గొన్నారు.

పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

అధినేత మెప్పు కోసమే చిర్ల వ్యాఖ్యలు

ప్రజాశక్తి - కొత్తపేట

వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మెప్పు కోసమే మాజీ ఎంఎల్ఎ, వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శంచారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశం గర్వించదగ్గ నేతగా ప్రశంసలందు కుంటున్న సిఎం చంద్రబాబు మానసిక స్థితి బాగోలేదని, పిచ్చాసుపత్రిలో చేర్చాలంటూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ముందుకు వెళ్తుందని, అది చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నియోజక వర్గంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా పనిచేసిన చిర్ల జగ్గిరెడ్డి అభివృద్ధి కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధిలోని పొడగట్లపల్లి లక్ష్మీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగసత్యవేణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రీ స్కూల్ విద్యార్థులు ప్రముఖులు వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రీ స్కూల్ విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

లేబర్ యాక్ట్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

లేబర్ యాక్ట్‌పై ఇటుకబట్టి యజమానులకు కార్మికశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం స్థానిక కాపు కళ్యాణ మండపంలో జరిగిన అవగాహన సదస్సులో కార్మిక శాఖ సహాయ అధికారి కాశి శివనాగమల్లేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ శ్రమ నమోదు, లైసెన్స్, నవీకరణ, రిజిస్ట్రేషన్ సంక్షేమ నిధికి సొమ్ము చెల్లించుట వంటిం అంశాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు వయసు వారిని పని లోనికి పెట్టుకోవద్దన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.1.47 కోట్లు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం ఆలయ ముఖ మండపంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి టివిఎస్ఆర్.ప్రసాద్ పర్యవేక్షణలో లెక్కించారు. 32 రోజులకు సంబంధించి హుండీల లెక్కింపులో 1 కోటి 47 లక్షల 12 వేల 969 రూపాయలు, 13 గ్రాముల బంగారం, 1 కేజీ 380 గ్రాములు వెండి, 64 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. అలాగే విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీ 32 రోజులకు 3 లక్షల 45 వేల 300 రూపాయలు సమకూరినట్లు ఆలయ డిసి నల్లం సూర్యచక్రధర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు దేవాలయాల కార్యనిర్వహణ అధికారులు, ఉప సర్పంచ్ పోచిరాజు బాబూరావు, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరు వెంకటరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - రామచంద్రపురం

కడప జిల్లా రైల్వే కోడూరు ఎంఎల్ఎ అరవ శ్రీధర్ సోమవారం భీమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా ఆయన భీమేశ్వర స్వామి శివలింగం, మాణిక్య మ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

NAME CHANGE

I, KARNEEDI VENKATESULU (Old Name), S/o. Suryachandra Rao of H.No. 2-203, Pedapati vari Veedhi, George peta, Tallarevu Mandalam, Kakinada District, Andhra Pradesh. I have to changed my name as **KARNIDI VENKATESULU** (New Name). Here after I will be called **KARNIDI VENKATESULU** (New Name).

ప్రకటన

కీ॥శే॥ మొల్లేటి సూరమ్మ (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం, ఠానేలంక పంచాయతీ, డోర్ నెం. 4-32/బి కాపురస్తురాలు మొల్లేటి సూరమ్మ (లేటు), భర్త: సుబ్రహ్మణ్యం (లేటు)ల మనమడు మొల్లేటి బాల సుబ్రహ్మణ్యం వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా నానమ్మ మొల్లేటి సూరమ్మ (లేటు) ఠానేలంక పంచాయతీ పరిధిలోని సొంత ఇంటి వద్ద ది. 30-06-2003 సం॥లో మరణించారు. వీరి మరణం నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: మొల్లేటి బాల సుబ్రహ్మణ్యం
తండ్రి: భాస్కరరావు (లేటు), డోర్ నెం. 1-2,
పల్లవారిపాలెం పంచాయతీ, ఠానేలంక బాడవ, ముమ్మిడివరం మండలం,
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 98497 20569

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు : కాకినాడ

I.A. 561/2025 in O.S. 359/2025

Between:
కొరిపెళ్ళ వెంకట సత్యశ్రీనివాస రావు ...పిటీషనర్ / ప్లెయింటిఫ్
మరియు
నూనె సత్యన్నారాయణ వగైరాలు ...రెస్పాండెంట్లు / డిఫెండెంట్లు

R_1 : **నూనె సత్యన్నారాయణ,** S/o. నరసన్న, వ్యవసాయదారుడు, పాతపంచాయితీ వీధి, గండ్రేడు గ్రామం, పెదపూడి మండలం, పిన్-533344, కాకినాడ జిల్లా.
R_2 : **గంటా శ్రీను,** S/o. వెంకటరాజు, వినాయక దేవాలయం వారి విధి, గండ్రేడు-533344, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
R_3 : **గంటా రాజు,** S/o. వెంకటరాజు, పెద్ద రామాలయం వీధి, గండ్రేడు - 533344, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
R_4 : **బొద్దు నారాయణరావు,** S/o. లచ్చన్న, పెద్ద రామాలయం వీధి, గండ్రేడు - 533344, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
R_5 : **పిల్లి భాస్కరరావు,** S/o. భూరయ్య, న్యూకోలనీ,వినాయక దేవాలయం వీధి, గండ్రేడు - 533344, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
R_6 : **తెల్లపూడి బాబూరావు,** S/o. సూర్యారావు, గౌరీదేవి దేవాలయం వీధి, గండ్రేడు గ్రామం 533344,పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
R_7 : **మోడిశెట్టి సత్తిబాబు,** S/o. శ్రీరాములు, పెద్దపేట దుర్గమ్మ దేవాలయం వారి వీధి, గండ్రేడు గ్రామం - 533344, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
R_8 : **నూనె వెంకటరమణ,** S/o. వీరన్న చౌదరీ, స్కూల్ బిల్డింగ్ ప్రక్కన, గండ్రేడు గ్రామం - 533344, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
R_9 : **మార్ని గంగాధర్,** S/o. సత్తయ్య, పెద్ద రామాలయం వీధి, గండ్రేడు - 533344, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.

పైన తెలిపిన 9 మంది రెస్పాండెంట్స్/ ప్రతివాదులు మరియు వీరితో జతకూడియున్న గండ్రేడు గ్రామస్తులు.

పై నెంబరు I.A.No. 561/2025 ను పైన తెలిపిన 9 మంది రెస్పాండెంట్లు/ప్రతివాదులు మరియు వీరితో జత కూడియున్న గండ్రేడు గ్రామస్తులు పైన, వాదిగారైన కొరిపెళ్ళ వెంకట సత్య శ్రీనివాసరావు గారు పెదపూడి మండలం గండ్రేడు గ్రామంలో చేరియున్న 48/1 LP.No.699 లో చేరియున్న 44 సెంట్లు ఆస్తిని గూర్చి రిప్రజెంటేటివ్ కెపాసిటీలో దావా దాఖలు చేయుటకు అనుమతి కోరుచూ దాఖలు చేసి ఉన్నారు. ఇందుపై ఎవరికి ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల పైన తెలిపిన కోర్టులో **ది.6-5-2025 తేదీన ఉదయం గం. 10.30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పైన తెలిపిన పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081